కులవృత్తులను గౌరవించుకోవాలి

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
రఘునాథపాలెంలో గౌడ కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన

గౌడ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రులు భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్

రఘునాథపాలెం, జూన్ 9 : కులాన్ని, కులవృత్తులను గౌరవించుకోవాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మండల కేంద్రం రఘునాథపాలెంలో గౌడ కులస్తులకు కేటాయించిన 29కుంటల స్థలంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రెవిన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ కమ్యూనిటీహాల్‌ను ఏడాదికాలంలో పూర్తి చేసుకునేలా అవసరమైన నిధులను సమకూర్చుతామని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యేలు మట్టా రాఘమయి, రాందాస్‌నాయక్, మేయర్ నీరజ, గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్, సత్యనారాయణ, తిరుమలరావు, వత్సవాయి రవి, కత్తి బొల్లికొండ శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

పోరాటాలతో ప్రభుత్వాలకు గుణపాఠం

మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

బోనకల్లు, జూన్ 9: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పనితీరుపై ప్రజా పోరాటాల ద్వారా తగిన గుణపాఠం తప్పదని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి నున్నా వెంకటేశ్వరరావు అన్నారు. బోనకల్లులోని ఎస్.ఆర్. ఫంక్షన్‌హాల్‌లో మధిర నియోజకవర్గ స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతోన్మాద విధానాలతో దేశంలో విచ్ఛిన్నకర విధానాలను అమలు చేస్తుందని విమర్శించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయలేని స్థితిలో ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరుబాట మార్గమని సీపీఎం ఆల్ ఇండియా మహాసభ నిర్ణయించిందన్నారు. మడుపల్లి గోపాలరావు, బట్టు పురుషోత్తం, రాజపంటి రాము, పాపినేని రామనర్సయ్య, శీలం నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

డ్యూటీ విషయంలో ఘర్షణ
లారీ డ్రైవర్‌ను హతమార్చిన మరో డ్రైవర్

విచారణ చేపడుతున్న మధిర సీఐ

మధిర, జూన్ 9: ఇద్దరు లారీ డ్రైవర్ల మధ్య ఘర్షణ జరగ్గా ఓ డ్రైవర్‌పై మరో డ్రైవర్‌ను ఇనుప రాడ్డుతో కొట్టి హతమార్చిన ఘటన మధిర మండలంలోని దెందుకూరు గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి జరిగింది. మధిర సీఐ డీ.మధు తెలిపిన వివరాల ప్రకారం.. అస్సాం రాష్ట్రానికి చెందిన శివ, ఒరిస్సా రాష్ట్రానికి చెందిన సుమన్‌పాండ్యా ఇద్దరూ నాగపూర్ అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ పనుల్లో లారీ డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. ఆదివారం రాత్రి డ్యూటీ విషయంలో ఇద్దరూ గొడవ పడ్డారు. వారి మధ్య మాటా మాట పెరిగి ఘర్షణకు దారితీసింది. శివ ఇనుపరాడ్‌తో సుమన్‌పాండ్య(45)ను తలపై కొట్టగా అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మధిర రూరల్ ఎస్సై లక్ష్మీభార్గవి నిందితుడు శివను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మధిర సీఐ ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

ఖమ్మం కమాన్‌బజార్, జూన్ 9 : ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలని, గుర్తింపులేని పాఠశాలలను సీజ్ చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఖమ్మంలోని గిరిప్రసాద్ భవన్‌లో ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యలపై పలు విద్యార్థి సంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు ఎటువంటి అనుమతులు లేకుండానే అడ్మిషన్‌లు చేస్తూ కోట్ల రూపాయలు దండుకుంటున్నాయని అన్నారు. సమావేశంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రవీణ్, సుధాకర్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి వెంకటేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెస్‌లను నిలుపుదల చేయాలని వినతి

బోనకల్లు, జూన్ 9: మండల పరిధిలోని ముష్టికుంట్ల గ్రామంలో ఎక్స్‌ప్రెస్ బస్సులను నిలుపుదల చేయాలని కోరుతూ టీఎస్ యూటీఎఫ్ బోనకల్లు మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం గ్రీవెన్స్‌డేలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. చిన్నరంగారావు, మండల ఆడిటర్ పీ.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

ప్రజావాణి అర్జీలను తక్షణం పరిష్కరించాలి

ప్రజావాణిలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

రఘునాథపాలెం, జూన్ 9 : ప్రజావాణిలో వచ్చిన సమస్యల అర్జీలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పీ శ్రీనివాసరెడ్డితో కలిసి అర్జీలను స్వీకరించారు. మున్నేరు కేబుల్ బ్రిడ్జి నిర్మాణంలో తమకు చెందిన 14షాపులను తొలగించారని ఖమ్మం కాల్వొడు హిందూ శ్మశానవాటిక నిర్వహణ కమిటీ వినతి అందజేసింది. అదేవిధంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలపై వినతులు అందజేశారు. డీఆర్వో ఏ పద్మశ్రీ, డీఆర్‌డీవో సన్యాసయ్య, ఏవో అరుణ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొంగులేటి

ఖమ్మం రూరల్, జూన్ 9: అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు దశల వారిగా అందజేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం మంత్రి ఏదులాపురం మున్సిపాలిటీ, ఖమ్మం రూరల్ మండలాల్లో ఆయన పర్యటించారు. ఏదులాపురం మున్సిపాలిటీలోని మద్దులపల్లి, తెల్దారుపల్లి గ్రామాల్లో పలు రహదారుల నిర్మాణ పనులకు శంకుస్థాసన చేశారు. మద్దులపల్లిలో డబుల్ బెడ్రూం లబ్దిదారులకు ధ్రువ పత్రాలను అందజేశారు. రాయల నాగేశ్వరరావు, హరినాథబాబు, నర్సింహారావు, శ్రీనివాసరెడ్డి, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రులు, పీసీసీ చీఫ్‌కు గౌడ సంఘం నాయకుల స్వాగతం

జిల్లా గౌడ కమ్యునిటీ భవనం శంకుస్థాపన, గౌడ సంఘం ఆత్మగౌరవ సభకు హాజరయ్యేందుకు జిల్లా పర్యటనకు వస్తున్న మంత్రులు బట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, పొంగులేటి, టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్‌కు మాజీ ఎమ్మెల్సీ బాలసాని ఆధ్వర్యంలో స్వాగతం పలికారు.

భట్టి, పొంగులేటి, పొన్నం, టీపీసీసీ చీఫ్ భేటీ

కూసుమంచి, జూన్ 9: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి, మంత్రి పొన్నం ప్రభాకర్, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్ సోమవారం సమావేశమయ్యారు. కూసుమంచి క్యాంపు కార్యాలయానికి వచ్చిన మహేశ్ కుమార్ గౌడ్‌ను సన్మానించారు. టీపీసీసీ చీఫ్‌ను పలువురు శాల్వలతో సత్కరించారు.

ప్రజా పోరాటాలకు యువత కలిసి రావాలి

యువ చైతన్య సైకిల్ యాత్ర

వైరాటౌన్, జూన్ 9: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ ఆధారిత చిన్న తరహా పరిశ్రమలకు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, సమస్యల పరిష్కారం కోసం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో చేసే పోరాటాలకు యువత కాలిసి రావాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్ పిలపునిచ్చారు. డీవైఎఫ్ఐ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన యువ చైతన్య సైకిల్ యాత్ర ఉత్సాహంగా కొనసాగుతుంది. 10వ రోజు వైరా మున్సిపాలిటీ పరిధిలోని సోమవరం, గండగలపాడు, వైరా పట్టణం, పల్లిపాడు, లాలాపురం గ్రామాల్లో యాత్ర సాగింది. యువత డ్రగ్స్ బారిన పడకుండా జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. డీవైఎఫ్ఐ ఉద్యమాల్లో యువత కలిసి రావాలని అన్నారు. చింతల రమేష్, శీలం వీరబాబు, ఎస్సై రామారావు, సత్తెనపల్లి నరేష్, గుమ్మా ముత్తారావు, రావులపాటి నాగరాజు, గోపినాథ్, కురెల్లి ధీరజ్, వేణు పాల్గొన్నారు.

బీజేపీ మతోన్మాద చర్యలను ఖండించాలి

పెనుబల్లి, జూన్ 9: సీపీఎం పెనుబల్లి మండల రాజకీయ శిక్షణ తరగతులు సోమవారం ముగిశాయి. స్థానిక చలమాల సూర్యనారాయణ భవనంలో రెండవ రోజు మతం–మతోన్మాదంపై డీవైఎఫ్ఐ ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షుడు గాలి వెంకట్రాది వివరించారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన నరేంద్రమోదీ, అమిత్‌షా, ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్, ఏజెండాలను ముందుకు తీసుకొస్తూ ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. గాయం తిరుపతిరావు, మిట్టపల్లి నాగమణి, చీమట విశ్వనాథం, నల్లమల అరుణప్రతాప్, చలమాల నరసింహారావు, తడికమల్ల చిరంజీవి, కంటే సత్యం, చిలక రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం

తిరుమలాయపాలెం, జూన్ 9: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేశారు. మండలంలోని పిండిప్రోలు, తెట్టెలపాడు, పాపాయిగూడెం, తిప్పారెడ్డిగూడెం, పాతర్లపాడు, బీరోలు, జూపెడ, కాకరవాయిలో మృతుల కుటుంబాలకు రూ.10,000 చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు.

రాజారంలో గంగమ్మతల్లి బోనాలు

గంగమ్మతల్లికి పూజలు చేస్తున్న ప్రజలు

తిరుమలాయపాలెం, జూన్ 9: మండలంలోని రాజారం గ్రామంలో సోమవారం గంగమ్మ తల్లి బోనాల పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. గంగమ్మతల్లి గుడికి బోనాలతో వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామాన్ని, ప్రజలను చల్లగా చూడాలని గంగమ్మతల్లికి పూజలు చేశారు.

వ్యవసాయ కూలీలకు ఆత్మీయ భరోసా ఇవ్వాలి

తిరుమలాయపాలెం, జూన్ 9: వ్యవసాయ కూలీలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో భాగంగా రూ.12000 అందజేయాలని కోరుతూ సోమవారం తిరుమలాయపాలెం ప్రజావాణిలో ఎంపీడీవో శిలార్ సాహెబ్‌కు ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. సోమనపల్లి వెంకటేశ్వర్లు, బానోత్ శంఖర్, పోలెపొంగు ఉప్పలయ్య, సీతరాములు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వైరాటౌన్, జూన్ 9: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన వైరా మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్ సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొణిజర్ల మండలం సిద్దిక్‌నగర్ గ్రామానికి చెందిన మోట వీరబాబు బైక్‌పై వైరా వచ్చి తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. వైరా మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్ సమీపానికి రాగానే ఎదురుగా ఖమ్మం నుంచి వస్తున్న లారీ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వీరబాబుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రున్ని 108 అంబులెన్స్‌లో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన తల్లాడ ఆర్యవైశ్యులు

రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాతను కలిసిన తల్లాడ ఆర్యవైశ్యులు

తల్లాడ, జూన్ 9: రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాతను తల్లాడ మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు కలిశారు. ఆదివారం రాత్రి ఖమ్మంలో జరిగిన ఆర్యవైశ్య సంఘం జిల్లా నూతన కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఆమె హాజరు కాగా తల్లాడ ఆర్యవైశ్యులు ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించారు. అనంతరం ఆర్యవైశ్యుల్లో పేదలు ఉన్నారని, వారికి కూడా ప్రభుత్వ పథకాలు వచ్చే విధంగా చూడాలని విజ్ఞప్తి చేశారు. కేతేపల్లి భాస్కర్‌రావు, దారా శ్రీనివాసరావు, నంబూరి కనకదుర్గప్రసాద్, తల్లాడ ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

‘మనిషిని మానవీయుడిగా మార్చేది సాహిత్యం’

ఖమ్మం అర్బన్, జూన్ 9: మనిషిని మహోన్నత మానవీయుడిగా మార్చేది సాహిత్య అధ్యయనమేనని కుప్పం ద్రావిడ విశ్వవిద్యాలయం ఇంగ్లిష్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ బి.తిరుపతిరావు అన్నారు. సోమవారం ఎస్ఆర్‌బీ జీఎన్ఆర్ కళాశాల తెలుగు, ఇంగ్లిష్ ఐక్యూ, ఏసీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు సాహిత్యంపై ఆంగ్ల సాహిత్య ప్రభావం అనే అంశంపై విస్తృతో పన్యాసం చేశారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బానోత్‌రెడ్డి, ఐక్యూ ఏసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎం సునంద, డాక్టర్ ఏ నర్సమ్మ, డాక్టర్ ఎం రాంబాబు, కే రవి కుమార్, బండారి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో
పంచాయతీ కార్యదర్శి మృతి
విధులకు స్కూటీపై వెళ్తుండగా ఢీకొట్టిన లారీ

భూక్యా సోనాలి(ఫైల్)

పెనుబల్లి, జూన్ 9: రోడ్డు ప్రమాదంలో ఓ మహిళా పంచాయతీ కార్యదర్శి మృతిచెందిన ఘటన సోమవారం వీ.ఎం.బంజర పోలీస్‌స్టేషన్ సమీపంలో జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కల్లూరు మండలం లక్ష్మాతండాకు చెందిన భూక్యా సోనాలి (33) పెనుబల్లి మండలం రామచంద్రాపురం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తుంది. ఆమె ఉదయం రామచంద్రాపురం గ్రామానికి స్కూటీపై విధులకు వెళ్తుండగా పెనుబల్లి పోలీస్‌స్టేషన్ సమీపంలో లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సోనాలి రోడ్డుపై పడిపోవడంతో పై నుంచి లారీ వెళ్లడంతో శరీర భాగాలు నుజ్జునుజ్జై అక్కడికక్కడే మృతిచెందింది. ప్రమాద సమయంలో సోనాలి హెల్మెట్ ధరించి ఉంది. సోనాలి మృతిచెందడంతో స్వగ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతికి కారణమైన లారీ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కల్తీ ఎరువులు, కల్తీ పురుగుమందులను అరికట్టాలి : ఏఐకేఎంఎస్

మాట్లాడుతున్న ఎస్.కే.ఉమర్

సత్తుపల్లి, జూన్ 9: కల్తీ ఎరువులు, కల్తీ విత్తనాలు, పురుగుమందులను ప్రభుత్వం అరికట్టాలని డిమాండ్ చేస్తూ అఖిలభారత రైతుకూలీసంఘం(ఏఐకేఎంఎస్) ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకులు ఎస్.కే.ఉమర్ మాట్లాడుతూ.. వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో కొంతమంది గ్రామగ్రామాన తిరిగి రైతులకు నకలీ విత్తనాలు, మందులు, ఎరువులు అమ్ముతున్నారని, వీటి వల్ల పంటలు నష్టపోతున్నారని అన్నారు. ప్రభుత్వం దృష్టి సారించి కల్తీ విత్తనాలు అమ్మే వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కే.సత్యనారాయణ, భారతి రాఘవులు, పామర్తి లక్ష్మయ్య, సయ్యద్ గౌస్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ పోల్ సమస్యలపై ఎస్ఈకి వినతి

రఘునాథపాలెం, జూన్ 9 : విద్యుత్ పోల్ సమస్యలపై కేబుల్ ఆపరేటర్లు సోమవారం జిల్లా కలెక్టర్, విద్యుత్‌శాఖ ఎస్ఈని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. దీనిపై ఎస్ఈ సీఎండీతో మాట్లాడి సమస్యపై పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. రాష్ట్ర సంఘం అధ్యక్షుడు పమ్మి సురేశ్, జిల్లా నాయకులు కన్నెబోయిన సీతరామయ్య, దమ్మాలపాటి రమేశ్, వెంకటేశ్వర్లు, నవీన్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఈకి వినతిపత్రం అందజేస్తున్న కేబుల్ ఆపరేటర్లు

14న మధిరలో నేషనల్ లోక్ అదాలత్

ఎర్రుపాలెం, జూన్ 9: ఈ నెల 14న మధిర కోర్టులో నేషనల్ లోక్ అదాలత్ జరుగుతుందని, ఎర్రుపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎర్రుపాలెం ఎస్సై రమేష్‌కుమార్ సోమవారం తెలిపారు. కేసులు రాజీ చేసుకునేందుకు ఈ నెల 9 నుంచి 14 వరకు ఇరువురు కోర్టుకు హాజరైనట్లయితే అట్టి కేసులు పూర్తిగా క్లోజ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు.

మున్సిపాలిటీలో టౌన్ వెండింగ్ కమిటీ సమావేశం

హాజరైన కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి

మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి

ఖమ్మం రూరల్, జూన్ 9: ఏదులాపురం మున్సిపాలిటీ సమావేశ మందిరంలో సోమవారం తాత్కాలింగ్ ఏర్పాటు జరిగిన టౌన్ వెండింగ్ కమిటీ సమావేశం జరిగింది. మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఆయా విభాగాల అధికారులతో పాటు, ఆయా శాఖల అధికారులు హాజరయ్యారు. వందరోజుల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా వెండింగ్ జోన్స్ గుర్తింపుపై అధికారులు చర్చించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ కో ఆర్డినేటర్ ఎస్ సుజాత, టౌన్ మిషన్ కో ఆర్డినేటర్ బీ వెంకటేశ్వర్లు, మెప్మా, ట్రాఫిక్ పోలీస్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

రసాయనక ఎరువుల వాడకం తగ్గిద్దాం

ఏడీఏ సరిత, కేవీకే కోఆర్డినేటర్ రవికుమార్

మాట్లాడుతున్న కూసుమంచి ఏడీఏ సరిత

ఖమ్మం రూరల్, జూన్ 9: ఏటేటా రసాయనాల వాడకం పెరిగిపోతుందని, రసాయనాల వాడకం తగ్గించి నేలతల్లి ఆరోగ్యం కాపాడుదామని వైరా కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ రవికుమార్, ఏడీఏ సరిత అన్నారు. సోమవారం మండలంలోని గోళ్లపాడు రైతు వేదికలో రైతు ముగింట శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కూసుమంచి ఏడీఏ బీ సరిత, కేవీకే కోఆర్డినేటర్ రైతుల సందేహాలకు సమాధానాలు ఇచ్చి నివృత్తి చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అధిక మొత్తంలో సాగులో రసాయనాలు వాడడం ద్వారా భూమిలో విలువైన పోషకాల సంఖ్య తగ్గిపోతుందన్నారు. తక్కువ మొత్తంలో రసాయనాలు వాడుతూ, సేంద్రియ ఎరువల వాడకం పెంచాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త ఎస్ఎమ్ ఫణీశ్రీ. జిల్లా రైతు సంఘం నాయకుడు నల్లమల వెంకటేశ్వరరావు, పశువైద్యుడు జగ్గులాల్, రైతు శిక్షణ కేంద్రం అధికారులు బాస్కర్, శరత్, ఏఈఓలు కావ్య, ఆదర్శ్, వంశీ పాల్గొన్నారు.

వైరా ప్రభుత్వ కళాశాల అభివృద్ధికి వినతి

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అధ్యాపకులు

వైరాటౌన్, జూన్ 9: వైరా పట్టణంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధి పనుల గురించి సోమవారం గ్రీవెన్స్‌డేలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు వినతి పత్రం ఇచ్చినట్లు స్థానిక వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.నవీనజ్యోతి తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ సమస్యలు పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చినట్లు ఆమె తెలిపారు. ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యారంగ సంస్కరణలపై విద్యా కమిషన్ చైర్మన్ పరిశీలన

మధిర, జూన్ 9: మధిర నియోజకవర్గంలో విద్యారంగ సమస్యపై రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీ సోమవారం మధిరలో పర్యటించారు. విద్యారంగ సంస్కరణలో భాగంగా మధిర నియోజకవర్గాన్ని ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిందన్నారు. దీనిలో భాగంగానే ఆయన మండలంలోని మహదేవపురం, సిరిపురం ఉన్నత పాఠశాలలను సందర్శించారు. గ్రామాల్లోని ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ఆయన వెంట జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణ, డీఐఈవో రవిబాబు, మండల విద్యాశాఖ అధికారి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

మధిర, జూన్ 9: జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం టీయూడబ్ల్యూజే(ఐజేయూ) ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంనారాయణ తెలిపారు. నియోజకవర్గ కేంద్రంలో సోమవారం టీయూడబ్ల్యూజే(ఐజేయూ)సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం కొంతమంది జర్నలిస్టులకు సభ్యత్వాన్ని అందజేశారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై అనేక సంవత్సరాలుగా టీయూడబ్ల్యూజే పోరాటాలు నిర్వహించి పలు సమస్యలను పరిష్కారం చేసిందని గుర్తు చేశారు. సామినేని మురారి, ఏనుగు వెంకటేశ్వరరావు, నాగెళ్ల శివానంద్, చెరుకుపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల ప్రచారం అభినందనీయం

ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

బోనకల్లు, జూన్ 9: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం పెంచేందుకు టీఎస్ యూటీఎఫ్ బోనకల్లు మండల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార కార్యక్రమం అభినందనీయమని మండల విద్యాశాఖ అధికారి దామాల పుల్లయ్య అన్నారు. సోమవారం టీఎస్ యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ బడుల్లో నమోదు శాతం పెంపుదలకై ప్రచార కార్యక్రమాన్ని, బైక్‌ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ బడుల్లో నమోదు శాతం పెంచే పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న ఉచిత విద్యను ప్రజలు వినియోగించుకోవాలన్నారు. గుగులోతు రామకృష్ణ, సద్దాబాబు, చిన్న రంగారావు, జల్లా కోటయ్య, పీ.గోపాల్‌రావు, కే.నిర్మల, కే.సురేష్, అల్వాల నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

టీయూసీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

వైరాటౌన్, జూన్ 9: ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా టీయూసీఐ ప్రథమ రాష్ట్ర మహాసభలు జూన్ 21, 22 తేదీల్లో నిజామాబాద్ జిల్లా కేంద్రంలో జరుగుతున్నాయని, ఈ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం వైరాలో విక్రమ్ భవనంలో పోస్టర్ ఆవిష్కరించారు.డి.శ్రీనివాసరావు, సీవై.పుల్లయ్య, యలదండి బాబు, కె.అర్జున్‌రావు, హన్మంతరావు, వెంకటి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు

ఎర్రుపాలెం, జూన్ 9: భూ భారతి రెవెన్యూ సదస్సులు మండల పరిధిలోని తక్కెళ్లపాడు, మీనవోలు గ్రామాల్లో సోమవారం కొనసాగాయి. తక్కెళ్లపాడులో 28, మీనవోలు 147 దరఖాస్తులు అందించారు. డీసీసీబీ డైరెక్టర్ ఐలూరి వెంకటేశ్వరరెడ్డి, ఏఎంసీ చైర్మన్ బండారు నరసింహారావు, తహసీల్దార్ ఎం.ఉషాశారద, మాజీసర్పంచ్ వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, ఆర్ఐలు రవికుమార్, రాజశేఖర్ పాల్గొన్నారు.

పెనుబల్లి బీసీకాలనీలో రోడ్లపై వెళ్తున్న మురుగు

పెనుబల్లి, జూన్ 9: పెనుబల్లి బీసీకాలనీలో డ్రైనేజీలు లేక మురుగు రోడ్లపైకి వెళ్తుండగా ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. సీసీరోడ్డుపై మురుగు ప్రవహిస్తోందని, దుర్గంధం వెదజల్లుతుందని స్థానికులు వాపోతున్నారు. దోమలకు నిలయంగా మారి విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.